ఇక్కడ ( ఈ కావ్యములో ) దేవి యొక్క తాత్త్విక స్వరూపము, వైదిక దేవతల, తాన్త్రిక దేవతల స్వరూప స్వభావములు, దేవతానుగ్రహ ప్రాప్తికగు ఉపాయము, దశమహా విద్యల తత్త్వము, ఉపనిషద్విద్యల సాధన. సందర్భోచితంగా ఈ మహాకవి చేత వివరింపబడెను.)

2. **బాలా సాహేబ్ ఖేరు, యరవాడ జైలు**

''ప్రాప్యగ్రంథ రాజ మత్ర త్వత్ప్రసాదతః కృతీ।
బంధనాలయ స్థితోఽపి నందనం వనం గతః॥

గణపతి ముని కవి రచితం ఉమాసహస్ర మనోహరం కావ్యమ్।
కారాగృహేషు వసతః పరతోమే సపది ముక్తిదం భూయాత్॥

(బాలా సాహేబ్ ఖేర్ గారు గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు తత్త్వవేత్త, సంస్కృత పండితుడు. గాంధీగారి అడుగు జాడలలో నిరాకరణోద్యమంలో పాల్గొనడం వలన వారికి అలనాటి బ్రిటిష్ ప్రభుత్వము కారాగార శిక్ష విధించింది. వారుయరవాడ జైలు నుండి ఉమాసహస్ర కావ్యంపై వ్రాసిన అభిప్రాయమిది.)

'' ఓ పండితుడా! నీ అనుగ్రహము వలన ఇక్కడ ఈ గ్రంథరాజము పొంది కారాగృహమందు ఉన్నప్పటికి, నందనవనగతమైన అనుభూతి కలిగింది.

గణపతి ముని కవిచే రచింపబడిన మనోహరమగు ఉమాసహస్ర కావ్యము పఠించిన, నాకు కారాగార వాసంలో నున్ననాకు అయ్యది వేగంగా ముక్తిని ప్రసాదించేది అగుగాక!

***



ఓమ్ః శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః
శ్రీ సరస్వతీ దేవ్యై నమః
ఓమ్ నమోభగవతే శ్రీరమణాయ.

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి ప్రథమ స్తబకము)

మూ॥ అఖిలజగన్మాతో మాతమసాతాపేన చాకులానస్మాన్
అనుగృహ్ణాత్వనుకమ్పాసుధార్ద్రయా హసిత చన్ద్రికయా॥

## ఆంధ్రీకృత పద్యము

కం. ఉమ, భువనమాతృ దేవత
తమమునఁ దాపమున, వికలితమనస్కులమౌ
మముఁ బ్రోచునుగాత, దయా
విమలసుధార్ద్రమగు నవ్వు వెన్నెలచేతన్.

**మూలానువాదము** :- అఖిలజగత్తులకును మాతయగు, ఉమా దేవత - తమస్సుచేతను (చీకటిచేతను లేక, అజ్ఞానము చేతను), తాపము చేతను, (ఎండచేతను, లేక ఆధ్యాత్మికము, అధిభౌతికము, ఆధిదైవికము, అను తాపత్రయము చేతను) బాధింపఁబడుచున్న మమ్ములను దయామృత స్రావముచే శీతలమగు తన హసితచంద్రిక చేత (వెన్నెలవంటి చిరునవ్వు చేత) సమనుగ్రహించును గాత!

ప్రభః- ఉమాదేవత - తన నవ్వుచేత మమ్మనుగ్రహించుఁ గావుతమనునది వాక్యాభిప్రాయము.

వెన్నెల - అమృతముచేత అర్ద్రమగునట్లు ఉమాహాసము- దయచేత అర్ద్రమగుచుండునని భావము.

చంద్రికచేత (వెన్నెలచేత) చీకటిపోయి, ఉష్ణత శాంతించునట్లు ఉమాహసితము చేత నజ్ఞానమునశించి, దుఃఖము నివర్తించునని తాత్పర్యము. ఇట్లు తమ స్తాపహరత్వము = చీకటిని, అజ్ఞానము - వేడిని, దుఃఖమును, నశింపఁజేయు వెన్నెలకును - నవ్వునకును సమాన ధర్మమైయున్నది.

ఉమాహసిత, చంద్రికలకు - రెండింటికిని. ఇందు ముఖ్యముగా సమానధర్మము - ఆహ్లాదకత్వము. అది యిందు గూఢ వ్యంగ్యమగుచున్నది. వెన్నెల అమృతకిరణశీతల సుఖస్పర్శగలదగుట చేతను - నవ్వు - దయామృతమయమగుట చేతను - ఆహ్లాదకరమగుచుండుట ప్రసిద్ధమైయున్నది.

తాపార్తుఁడగు వానికమృతమేకదా యౌషధము ! జ్ఞానమున కాటంకమగుచున్న జడత్వమే తమస్సు. ఆనందము నడ్డుపెట్టునదియే తాపము. ఈ తమస్తాపములకు రెంటికిని ఉమాహాసము వలననేనివృత్తికలుగును. ''ఆహాసమే - ప్రకాశరూపమగు చిద్రూపము. అమృతమయమగు ఆనందరూపము'' అను నంశము స్ఫురించుచున్నది.

కావున చిదానందస్వరూపమగు నుమాహసితము - జ్ఞాన ప్రకాశస్పర్శచేత మా జడత్వమును, అమృతానందప్రవేశము చేత మా తాపత్రయమును, నశింపఁ జేయుఁగావుతమని తాత్పర్యము, సమ్+ అనుగ్రహించుఁ గాతయనఁగా - చక్కగా అనుసరించి గ్రహించుగాతమని యర్థము. ఆహాసము- అవిచ్ఛిన్నధారారూపమున మాయమ్మయగు నుమాదేవతకును, మాకును - అంతరము లేకుండునట్టి వ్యాపారము నొనర్చునుగాతమని యర్థము. నిత్యపూర్ణకళామయమగు నుమాముఖ చంద్రబింబము నుండి వెలువడిన హసితచంద్రికయే యంతటను వ్యాపించి మమ్మనుగ్రహింపఁగలుగును. కావున హసితచంద్రికచేత - ముఖచంద్రుఁ డాక్షేపింపఁబడునని గ్రహించునది. ఇట్లు ఇందలి యలంకారము శ్లేషోజ్జీవితమగు రూపకమగుచున్నది.



స్తావకలోక ప్రతినిధియగు కవిచక్రవర్తి తనలోకానుగ్రహవాంఛను, తన దృష్టివైశాల్యమును, తనమహాసత్త్వతను మీది శ్లోకము చేత బ్రకటించుకొన్నాఁడు.

మూ॥ నిఖిలేషు ప్రవహన్తీం నిరుపాధి విమర్శయోగదృశ్యోర్మిమ్।
అజరామజామమేయాం కామపిహస్తే మహాశక్తిమ్॥ 2

అంధ్రీకృతి :-

ఆ. సకలమునఁ బ్రవహించుచు - జరయు, జనియు,
మానమును, లేక - నిరుపాధిమద్విమర్శ
యోగదృశ్యోర్మియయి, ఒకానొక విచిత్ర
మగు మహాశక్తికి నమస్క్రియను ఘటింతు. 2

**మూలానువాదము :** - ఈ లోకమునందును, పరలోకమునందును గల సమస్త వస్తువుల యందును నిరంతరముగ ( ఎడతెగకుండ) ప్రవహించుచు, దేశ కాలాదిభేద రహితమగు విచారము ( ఆలోచన) గల యోగమునందు - సూక్ష్మ దృష్టికిమాత్రమే గోచరములగు తరంగములు గలిగి - జర ( ముసలితనము) జన్మ ( పుట్టుక) మానము ( కొలత) లేక, అనిర్వచనీయమగు ( ప్రత్యక్షాదిప్రమాణము చేతఁ దెలియుటకు శక్యముకాని) మహాశక్తికి నమస్కరించుచున్నాను.

**ప్రభ :**- నదీజలము స్రవించుటచేత - క్షేత్రములు నదీమాతృకములగునట్లు, శక్తి ప్రవాహము చేత - సృష్టియందున్న వస్తువులన్నియు శక్తిమాతృకములగుచుండును.

సర్వవస్తువులకును జీవనాధారము - ఆమహాశక్తియేగదా !

దేశకాలాది భేద శూన్యమును, అఖండ బ్రహ్మస్వరూప పర్యాలోచనాత్మకమును నగు నిర్విషయధ్యానయోగమే - నిరుపాధి విమర్శ యోగము.

(''నేనీ దేశమునందున్నాను (నేనాంధ్రుడను) ఈ దినము శుక్రవారము. నేను బ్రాహ్మణుఁడను, నా పేరు రమణమూర్తి, నేను తదితరజీవులకంటెను,

పరమేశ్వరునికంటెను, భిన్నుఁడను. గృహస్థుఁడను (సన్యాసిని) అద్వైతమతస్థుఁడను (హిందుమతస్థుఁడను) మహాపండితుఁడను (సర్వోత్కృష్టుఁడను) సుందర రూపుఁడను,'' ఇత్యాదిభేదజ్ఞానము లేక పరిపూర్ణమగు బ్రహ్మస్వరూపమును నిరంతరము భావించుటయే నిరుపాధి విమర్శయోగము.)

అట్టి యోగమునందు పరిపూర్ణమగు శక్తి కనఁబడకున్నను, అప్రత్యక్షయు, ప్రవాహరూపిణియునగు నామె యొక్క 'తరంగములు' అనఁగా, అల్పాంశములు మాత్రమే కనఁబడుచుండును.

ఆమెకు ముసలితనము మున్నగు వికారములు (పుట్టుట – ఉండుట – పెరుగుట, మారుట, తరుగుట, నశించుట అను పరిణామములు) లేవు. ఆమె భూత భవిష్యత్ – వర్తమానకాలములు మూడింటియందునుండును. ఆమె యెంతపరిమాణము గలదియో చెప్పుటకు ప్రమాణము లేదు. ఆమె స్వరూప మెట్టిదియో తెలుపుటకు వీలు కాన్పింపదు. కావుననే ఆమహాశక్తి – విచిత్రమయినది – అట్టి శక్తికి నమస్కారము చేయుచున్నానని తాత్పర్యము.

ఇట్లీస్తోత్ర కావ్యారంభమునందు – ఈ కవీశ్వరుఁడు ప్రథమ శ్లోకమును లోకానుగ్రహము నభ్యర్థించి, ద్వితీయ శ్లోకమునఁ దనకు ధ్యానయోగమునం దలపడిన సత్యస్వరూపవ్యాపారము గల మహాశక్తిని శ్లాఘించుచున్నాఁడు.

**అవతారిక**:- ఇందున్న ప్రథమ శతకమున నాలుగు స్తబకములున్నవి. ఈ స్తబకములయందు – పర దేవతను గుఱించి లభించిన వేదశాస్త్రాధారములను, సమయ భేదములను, ఉదాహరించుచు – అక్కడనక్కడ – అవకాశమునునుసరించి వాని గూఢార్థములను వివరించి, తత్సాక్షాత్కారపథావతీర్ణములగు – అనుభవ విశేషములను ప్రదర్శించుచున్నాఁడు.

అందీ ప్రథమస్తబకమున సత్య – తపో – జన – లోకములను నిత్యలోకముల తత్త్వమును దెలుపుచు, తన్మూలమున పరదేవతాస్వరూపమును స్తుతించుచు, తత్



పరదేవతా విషయమున ప్రవర్తింపఁబడిన కథాంశముల తాత్పర్యమును వివరించుచున్నాఁడు.

మూ॥ సాత తత్త్వః సమన్తాత్, సత్యస్య విభో స్తతా తపశ్శక్తిః।
లీలామహిలావపుషా, హైమవతీ తనుషుకుణ్డలినీ॥ 3

గీ. ఆ మహాశక్తి - సత్యాత్ముఁడైన విభుని
దృఢతపశ్శక్తి - లీలాసతీ శరీర
ధారణను హైమవతి - జీవతనువులందు
నరయకుండలినీ శక్తి - యనఁగవరలు. 3

**మూలానువాదము** :- తత్త్వదృషి చేత విచారించునెడల, ఆ మహాశక్తి – సత్యస్వరూపుడగు పరమేశ్వరుని చుట్టును వ్యాపించియున్న తపశ్శక్తియగుచున్నది. ఆమెయే లోకుల ననుగ్రహింపవలయునను వాంఛచేత 'లీలాశరీరమును' ధరించుట చేత – హైమవతి (పార్వతి) యగుచున్నది. ఇంక మన శరీరములయం దొకానొక శక్తి గలదు. అదియే కుండలినీ శక్తి. ఈ కుండిలినీ శక్తి – తంత్రశాస్త్ర ప్రసిద్ధమైయున్నది. ఇది యోగులకు మాత్రమే కనఁబడుచుండును.

ప్రభ :- మహాశక్తి – త్రివిధరూపయైయున్నది.

అద్వితీయుఁడును సత్యస్వరూపుఁడునునగు పరమేశ్వరునకు – సూర్యునకు – ప్రభవలె, సహజసిద్ధయు సర్వవ్యాపినియునగు తపోరూపయగు శక్తి కలదు. మహాశక్తి కిదియే మూల స్వరూపము. కావున నీతపశ్శక్తియే యామెకు మొదటి రూపము. లోకుల ననుగ్రహించుటకై స్వీకరించిన హైమవతీరూపము – రెండవది. సకల జంతువులయందును గల కుండలినీ శక్తియే మూడవది.

ఇట్లీపద్యమునందు – అధ్యండము – అధిదైవతము – అధ్యాత్మము – అగు మహాశక్తి యొక్క రూపత్రయము – ప్రస్తుతింపఁబడినది.

1. అధ్యండము – తపశ్శక్తి 2. అధిదైవతము – హైమవతి 3. అధ్యాత్మము – కుండలిని.

యోగశక్తిచేత, కుండలినీ శక్తియు, మంత్రశక్తిచేత హైమవతియు, జ్ఞాన నిష్ఠచేత – తపశ్శక్తియు గ్రహింపఁబడునని యెఱుంగునది.

**అవ** :– పరమ పురుషుఁడును – తచ్ఛక్తియు – సత్య – తపో – జనలోకము లెట్లగుచున్నదియు రెండు శ్లోకములచే నిరూపించుచున్నాఁడు.

మూ॥ పరమః పురుషోనాభిర్లోకానాం, సత్య ఉచ్యతేలోకః।
పరిత స్తతః సరన్తీ సూక్ష్మాశ్క్తి స్తపోలోకః॥ 4

గీ. అఖిలలోకంబులకు 'నాభి' యయిన పరమ
పురుషుఁడే – సత్యలోకాఖ్యఁ బొలుచుచుండు ;
అతనిచుట్టును బ్రసరించు – వితతమైన
సూక్ష్మశక్తి – తపోలోకసూక్తి మెఱయు. 4

**మూలానువాదము**:– సమస్తలోకములకును 'నాభి' అనఁగా 'మధ్యమస్థానము' అగు పరమపురుషుఁడు – సత్యలోకమని చెప్పఁబడుచున్నాడు. ఆ పరమాత్మయం దంతటను వ్యాపించియున్న సూక్ష్మమగు శక్తియే (పరమేశ్వర తపశ్శక్తియే) తపోలోకమని చెప్పబడుచున్నది.

**ప్రభ** :– 'సత్యస్వరూపుఁడగు పరబ్రహ్మమే సత్యలోకము' అని చెప్పుటచేత నాసత్యలోకమే ( అపరబ్రహ్మమే) అఖండము – అనంతము – సర్వలోకములకును ఆద్యము ( ఆధారము) అనునంశము తెలియఁజేయఁబడినది. రథచక్రముయొక్క నాభియందలి ( కుంచమునందలి) ఆకులవలె సత్యలోకమగు పరబ్రహ్మమునందే సకలలోకములను వసించుచున్నవని భావము, ప్రాణి నుండి ప్రాణము వేఱుచేయఁబడనట్లు పరమపురుషుని నుండి వాని శక్తి వేఱు చేయఁబడ నేరదని యెఱుంగునది.



**అవ** :- ఇట్లు 'సత్యలోకము – పరబ్రహ్మమే, తపోలోకము – సంకల్ప రూపమగు తచ్ఛక్తియే' అని తెలిపి యిప్పుడు మూడవదగు జనలోక స్వరూపమును వివరించుచున్నాఁడు.

మూ॥ అన్తర్గూఢార్థానాం పురుషాగ్నే ర్ధూమకల్ప ఉద్గారః।
శక్తిజ్వాలాః పరితః ప్రాన్తేష్వభవజ్జనోలోకః ॥ 5

కం. పురుషాగ్నికి దూమనిభము
పరపురుషాంతర్ని గూఢ వస్త్వాద్గమ, మీ
శ్వర శక్తిజ్వాలల నా
వరించి, 'జనలోక' మయ్యె ప్రాంతములందున్, 5

**మూలానువాదము**:- అగ్ని నుండి బయలువెడలిన పొగ – అగ్ని జ్వాలల యందంతటను నావరించునట్లు సత్యలోకమగు పరమపురుషుని నుండి బయలుల్వెడలుచు, సూక్ష్మము లగుటవలన అస్పష్టములగు పదార్థములు – ఆ పరమేశ్వరుని తపశ్శక్తి తరంగము లందంతటను వ్యాపించి,

'జనలోకము'

అని చెప్పఁబడుచున్నవి.

**ప్రభ** :- ఏపదార్థము లవ్యక్తమగు నవస్థ (స్పష్టముకాని సూక్ష్మరూపము) గలిగి భూత – భవిష్యత్ – వర్తమానములందగు సర్వలోకములకును, జీవములకును, సూక్ష్మములగు బీజములై ( విత్తనములై) ఉపాదానకారణములై యున్నవో., ఆ పదార్థములే – పరమపురుషుని తపోజ్వాలల యందంతటను వ్యాపించి,

'జనలోకము'

అని చెప్పఁబడుచున్నవని భావము.

జన, తపః, సత్యములను నీలోకములు మూడును విడివడనివియు, నెల్లప్పుడు నుండునవియు, (నిత్యములు) నయియున్నవి.

'సప్తలోకవాదులు' అనఁగా లోకములు – ఏఁడుగలవని చెప్పువారు గూడ – సత్య – తపో – జనలోకములను కల్పితములగావనియు, నిత్యములనియుఁ జెప్పుదురు. కాఁగా, వేదాంతులచేత – త్రివిధమని ప్రతిపాదింపఁబడిన 'సచ్చిదానంద' లక్షణమగు, అద్వితీయ పరబ్రహ్మము – సృష్టిసంబంధము నపేక్షించి లోకత్రయ రూపమగుచున్నదను నంశము సిద్ధించుచున్నది.

సత్ + చిత్ + ఆనంద (సచ్చిదానంద) అనువానియందున్న

1 సత్తే – సత్యలోకము.

2. చిత్తే – శక్తి రూపమగు తపోలోకము

3. ఆనందమే – జనలోకము.

పరమపురుషుడొక్కఁడే యీ సృష్టికి తపశ్శక్తి రూపమగు చిత్ స్వరూపము చేత నిమిత్తకారణమును, జనయితృత్వ ధర్మము గల యానందస్వరూపము చేత ఉపాదానకారణమును, అగుచుండునని యెఱుంగునది,

పురుషున కీతపస్సు ప్రాణమువలె క్రియను గల్గించుననియు, శరీరమువలె ఆనందము స్వరూపమగుచుండుననియుఁ దెలియఁదగును.

**అవ**:- తపో జన లోకములకుఁ గల సంబంధమును శ్లోకత్రయమున వివరించుచు వాని నామ భేదములను ప్రదర్శించుచున్నాఁడు.

మూ. అతి సూక్ష్మ ధూమకల్పం, లోకంతతమాఖ్య యాన్యయా నాకమ్।
ఏతం - తతోఽపిసూక్ష్మా, వ్యాపాఽస్త రతః పరాశక్తిః॥ 6

కం. అతిసూక్ష్మమ్మగు, ధూమా
కృతిఁబోలుచు - ''నాక'' మనఁగ నింకొక సంజ్ఞన్
తతమగు జనలోకము - గూ
ఢతర పరాశక్తి సెల్లెడల వ్యాప్తమగున్. 6



అతిసూక్ష్మమగు పొగవలె నుండునదియు, 'నాకము' (లేక స్వర్గము) అను వేరొక సంజ్ఞగలదియునగు నీజనలోకము నందంతకంటెను గూడ సూక్ష్మమగు పరాశక్తి వ్యాపించియున్నది.

**ప్రభ** :-పొగనడుమనుండు జ్వాలవలె జనలోకమధ్యమునఁ దపోలోక మున్నదనియు, అది మిక్కిలి సూక్ష్మమును, గొప్పదియునై యుండుననియు దెలిసికొనునది. అకమనఁగా దుఃఖము, (న+ అకము = నాకము) అను వ్యుత్పత్తిచే, దుఃఖములేని లోకము నాకమని (స్వర్గమని) చెప్పఁబడును.

ఆనందమయమగు జనలోకమునకే 'నాక' మని పేరుగలదు. దానియందే అత్యంత సూక్ష్మమగు తపోలోకమున్నది. కావున స్వర్గాఖ్యమగు జనలోకము కంటెను గూడ నీతపోలోకము మిక్కిలి సూక్ష్మమని భావము.

**అవ** :- కొందఱు పొగనడుమనున్న శుద్ధజ్వాలవలె జనలోకము నడుమనున్న తపశ్శక్తికళనే (సోపాధికయగు తపశ్శక్తినే) స్వర్గమని యందురని మత భేదమును జెప్పుచున్నాఁడు.

మూ. ధూమన్తరోష్మకల్పా, శుద్ధ జ్వాలోపమాచయాశక్తిః।
తాందివమాహుః, కేచన, పరమవ్యో మాపరేప్రాహుః॥ 7

కం. ధూమాంతరోష్మ కల్పం
బైమహితజ్వాలఁ బోలునది - కొందఱు స్వర్
ధామమనియంద్రు ''పరమ
వ్యోమ'' మని వచించుచుందు రొకకొందఱహో ! 7

కొందఱు పొగనడుమ నుండు ఘర్మము (వేడి) వంటిదగుచు, పరమేశ్వరునుండి బయలు వెడలుచున్న సూక్ష్మ పదార్థములే స్వరూపముగా నున్న జనలోకము నడుమను శుద్ధమగు నగ్నిజ్వాలవలెఁ బ్రకాశించు శక్తినే – స్వర్గమని యందురు. దీనినే మఱికొందఱు 'పరమవ్యోమము' అని చెప్పియున్నారు.

**ప్రభ** :- సింహావలోకనము :- పరమపురుషుఁడే సత్యలోకము, సత్యలోకమగు పరమపురుషునకు తపోరూపమగు శక్తి యొక్కటియే కలదని మొదట చెప్పఁబడినది.

పిమ్మట నా శక్తి – పరమపురుషునం దెల్లెడలను వ్యాపించియున్నట్లు చెప్పఁబడియెను, అదియే 'తపోలోక' మని చెప్పఁబడినది.

తదుపరి, ఆశక్తినావరించి, తత్ ప్రాంతములయందున్నదియు, పరమాత్మయందు గూఢమైయున్నదియునగు సూక్ష్మవస్తూద్గారము.

'జనలోకము'

అగుచున్నదని తెలుపఁబడినది.

ఇక్కడ సత్యలోకమునుండి, తపోలోకద్వారమున, సర్వలోకోపాదాన కారణమై నిర్గమించిన జనలోకము నడుమను ప్రచారముగల యుపాధియుక్త యగు శక్తిని– నిరుపాధియగు మూలశక్తి నుండి వేఱుచేసి, గూఢార్థరూపమగు జనలోకము పాధిగాఁగల తపశ్శక్తికళను గొందఱు స్వర్గమనియు, మఱికొందఱు పరమ వ్యోమమనియు నందురని చెప్పఁబడియెను. 'ఋచో అక్షరేపరమేవ్యోమన్' అని ఋగ్వేదమునందును, 'యో, వేద' నిహితంగుహాయాం పరమే వ్యోమన్' అని యుపనిషత్తులయందును (తైత్తిరీయమునందును)

ఈ 'పరమవ్యోమము'

ప్రసిద్ధమై యున్నదియే.

**ఫలితాంశము** :- సృష్టికారణమగు ద్రవ్యములుగలదియు, జనలోకమను పేరుగలదియు, పరమాత్మనుండి బయల్వెడలినదియునగు నర్థసంఘాతమును కొందఱు స్వర్గమని చెప్పుదురు. కొందఱు, జనలోకమును స్వర్గమని చెప్పరు. తదుపహిత జ్వాలాలోపమయగు శక్తినే (సోపాధికయగు శక్తినే) స్వర్గమని చెప్పుదురు. మఱికొందఱు దానిని పరమవ్యోమమని (పరమాకాశమని) తలంచెదరు.

"**1** పరమపురుషుఁడు – సత్యలోకము, **2** తపశక్తి – తపోలోకము, **3** ఉపాదానకారణమగు సూక్ష్మవస్తుజాలము – జనలోకము. **4.** జనలోకోపాధికయగు శక్తి – స్వర్గము – లేక ! పరమవ్యోమము " అనునది. ఫలితార్థము.



**అవ** :- జనలోకోపాధికయగు శక్తి – పరమవ్యోమమని చెప్పబడుటవలన జనలోకము – వ్యోమమని చెప్పఁబడునని చెప్పుచున్నాఁడు.

మూ॥ ఉద్గీర్ణ ధూమకల్పోయోఽ యమపారో మహాన్ జనోలోకః।
వ్యోమా న్తరిక్ష గగనప్రభృతిభి రభిధాభి రాహూస్తమ్॥ 8

గీ. అది – సముద్గీర్ణ ధూమాభ, మాజనాఖ్య
మయిన లోకమ్మపార మహత్త్వయుతము
వ్యోమ, గగ, నాంతరిక్షాది నామములను
పండితాఖండలులు దానిఁ బ్రస్తుతింత్రు. 8

బయలువెడుచున్న పొగవలెనుండు జనలోకమునకు హద్దు కనఁబడదు. అది చాలగొప్పది. పండితశ్రేష్ఠులు దానినే వ్యోమము, గగనము, అంతరిక్షము మొదలగు పేళ్లచే వ్యవహరించుచుందురు.

**ప్రభ** :- జనలోకము ఆకాశరూపమని చెప్పఁబడినది. ఆయాకాశ మానంద స్వరూపమనునంశము – శ్రుతి ప్రసిద్ధమగుచుండుటచేత ఆనందమే – ఆకాశమనునర్థమేర్పడుచున్నది. కావుననే – ఛందోగశ్రుతి – బ్రహ్మశరీరమగుట చేత నాయాకాశము పుట్టుకలేనిదని చెప్పుచున్నది. ఆకాశమే – సర్వలోకములకును – ఉపాదానకారణమని యిచట నెఱుఁగునది.

'టునదిసమృద్ధౌ' అని సమృద్ధ్యర్థకమగు 'నందతి' ధాతువునుండి యేర్పడిన ఆనంద శబ్దము సమృద్ధిమంతమను నర్థమును జెప్పును. కావున ఆనందమనఁగా పరిపూర్ణమను నర్థమేర్పడుచున్నది. 'ఆఙ్=సమన్తాత్ కాశతే' అను నిర్వచనము చేత, ఆకాశ శబ్దమునకుఁ గూడ 'అంతటను బ్రకాశించుటచేత, విభువును, పూర్ణమును, సమృద్ధమును అగునది, అనునర్థమే యేర్పడుచున్నది.

ఆకాశశబ్దవాచ్యమగు జనలోకమునందు – శక్తిప్రకాశము గూఢముగా నుండును. దానియందు – జ్వాలారూపమగుచున్న పరమాకాశమునం దాశక్తి ప్రకాశము స్పష్టముగానుండును.

గూఢమగుశక్తి ప్రకాశముగలది – ఆకాశము, స్పష్టమగు శక్తి ప్రకాశము గలిగి, జ్వలించునది – పరమాకాశము,

ఇదియే – వ్యోమమునకును, పరమవ్యోమమునకును, గల భేదమని తెలియునది.

**అవ** :- సృష్టింపఁబడుచున్న లోకములన్నింటికిని నిమిత్త కారణమగు శక్తికిని – ఉపాదానకారణమగు నాకాశమునకును గల వివేకము నెఱిఁగించి– ప్రసంగ వశముచేత సృష్టిమార్గమును నిరూపించుచు. పరమపురుషుని నుండి వేఱయి ప్రకాశించునాత్మయే – యీ జనలోకమునుండి – సృష్టినిగావించునని చెప్పుచున్నాఁడు.

మూ॥ ప్రాన్తేషు కోఽపిశక్తేః పృథగాత్మావియదుపాధిసఙ్గేన।
పరమాత్మనో విభక్తః స్వయమభిమన్తా వినిష్పేదే॥ 9

శా. శక్తి ప్రాంతములౌ తపోజన జగత్సంధి ప్రదేశాల న
వ్యక్తుండైన పరాత్మునుండి జనసంబంధంబు చేతన్ బృథగ్
వ్యక్తిత్వంబు వహించి. అతఁడెవడో భాషింపఁగా రా, దభి
వ్యక్తుండయ్యెను స్వాభిమాని-సృజనవ్యాపార దక్షాత్ముఁడై. 9

జ్వాలారూపమగు శక్తి యొక్క తీరములందు ( తపోలోక – జనోలోకముల సంధిప్రదేశములయందు ) జనలోకమగు నాకాశమను నుపాధి తోడి సంపర్కము చేత ఇట్టివాఁడని నిశ్చయించుటకు శక్యము కాని వాఁడై, అవ్యక్తుఁడగు పరమాత్మనుండి వేఱయి స్వాభిమానపూర్ణుఁడగు నొకానొకవ్యక్తి – ప్రపంచ సృష్టి వ్యాపారమునకు దక్షమగు (సమర్థమగు) స్వరూపమున నభివ్యక్తుఁడయ్యెను.

సృష్టి వ్యాపార దక్షుఁడగుటచేత అతఁడు దక్షుఁడని ( సమర్థతఁ గలవాడని) చెప్పఁబడుచున్నాఁడు.

ప్రభ :- వివ :- పరమపురుషుఁడు. పరమాత్మయే. అతఁడన్నిఁటికంటెను పరుఁడు, కావుననే మనకుఁగనఁబడక సత్య స్వరూపుఁడై యున్నాఁడు.



శక్తిప్రాంతములయందగు నాకాశముతోడి సంపర్కమువలన నవ్యక్తబ్రహ్మము నుండి యభివ్యక్తిగల స్వాభిమానియగు నొకపురుషుఁడు సృష్టికధ్యక్షుఁడయ్యెనని భావము.

అన్ని వస్తువులును దనవేయను జ్ఞానమే – స్వాభిమానము. ''నేనున్నాను. ఇది నాది'' అనుజ్ఞానమే స్వాభిమానము. ఇదియే సృష్టిమూలమగుచుండును. పృథగ్ వ్యక్తిత్వమనఁగా, వేరయిన స్వరూపము గలిగియుండుట, అభివ్యక్తుఁడనగా అంతటను ప్రకాశించువాఁడని యర్థము. సర్వలోకములకును మూలపురుషుఁడు పరమాత్మయే. అతనికంటె వేఱగుస్వరూపముగల యొకానొక వ్యక్తి – ఈ సృష్టికి సాక్షాత్తుగా నధ్యక్షుఁడగుచున్నాఁడని తెలియవలయును.

ఆయధ్యక్షుఁడే – యీదక్షుఁడు.

అవతారిక – ఆకాశస్వరూపమగు జనలోకమున శక్తిజ్వాల చేత బ్రకాశించుచున్న ఏయాత్మస్పష్టపడెనో, అతఁడే దక్షుఁడనియు, తచ్ఛక్తియే – దాక్షాయణి యనియు, మూఁడు శ్లోకముల చేత జెప్పుచున్నాఁడు.

మూ॥ దక్షః పరోక్షముదితః పన్థా ఏషత్విషాంజనో లోకః॥
తద్గర్భే లబ్ధాత్మా కథితా దాక్షాయణీ శక్తిః॥ 10

కం. దక్షుఁడను పరోక్షోక్తి – ప
రిక్షి ప్రద్యుతి, జనాంతరిక్షముఁ దెలుపున్,
సాక్షాత్కృతి నందెను శ్రీ
దాక్షాయణియనఁగ శక్తి తత్కుక్షినహో! 10

నిగూఢమగు భాషచేత ప్రజ్వలితమగు నాకాశమే – దక్షుఁడని చెప్పఁబడుచున్నది. ఆప్రజ్వలితాకాశము – అర్చిస్సులకు మార్గముగా నున్నది. ప్రజ్వలితాకాశరూపమగు ఆదక్ష స్వరూపము యొక్క గర్భము నుండి స్వరూప ప్రాప్తి నొందిన శక్తియే – దాక్షాయణియని చెప్పఁబడుచున్నది.

**ప్రభ :-ప్రశ్న** :- కావ్యకంఠుండగు నీ మహాకవి – 'ప్రజ్వలితమగు జన లోకము – దక్షుండు. తద్గర్భజాత – దాక్షాయణి' అని చెప్పుచున్నాండు. ఇది యతని స్వకపోలకల్పితము వలెనున్నది. దీనికి ంబ్రమాణమున్నదా.?

**ఉ**:- ఉన్నది, అది – ప్రత్యక్షవచనము కాదు కావుననే యీ కవిచంద్రుండు– 'పరోక్షముదితః'' పరోక్షముగాం జెప్పంబడినదని చెప్పుచున్నాండు వేదమంత్రములు గూఢమగుభాషచేతనే తత్త్వములను జెప్పుచుండును. 'పరోక్ష ప్రియాదేవాః' అని బ్రాహ్మణము చెప్పుచున్నది గదా!

పరోక్షమనగా, అప్రత్యక్షము. దేవతలు – అప్రత్యక్ష (పరోక్ష) వచనమునందే ప్రీతిగలవారని తాత్పర్యము.

దక్షునుద్దేశించి చెప్పంబడిన పరోక్ష (అప్రత్యక్ష) వచనము మంత్రములందు – ఇట్లున్నది.

| | |
|---|---|
| 'అదితే ర్దక్షో అజాయత | అదితినుండి దక్షుండు పుట్టెను |
| దక్షా ద్వదితిః పరి | దక్షునినుండి అదితిపుట్టెను – అని. |

ఈ యంశము ముందు విస్తరింపంబడును.

అవ :– దాక్షాయణీ శక్తి ప్రాదుర్భావము దెలుపుచున్నాండు.

మూ॥ సత్యాః ప్రాగపిశక్తేః ప్రాదుర్భావః సకీర్త్యతే ప్రథమః।
ఈశాభిమానమయ్యాః పృథగభిమానిత్వ నిష్పత్యా॥ 11

కం. అధిపాభిమాన, ముందును
ప్రథితసతియె, అయిన నాపరాశక్తి కటన్
పృథగభిమానము గలుగుట,
ప్రథమా విష్కృతిగ దాని భావింత్రు బుధుల్. 11

పరమేశ్వరాభిమాన ప్రచురయగు నాదిశక్తి – ఈ దక్షుండను నాత్మ ప్రకాశింపక ముందు గూడ ప్రసిద్ధముగా 'సతియే' = ఉన్నదియే యగుచున్నది. ఇప్పుడు



దక్షస్వరూపమునుండి కలిగిన యీ నూతన స్వరూపమునందు (దాక్షాయణీ నామాంతరయగు సతీరూపమునందు) తనకు వేఱుగా నభిమానము జనించుట చేత – ఆదాక్షాయణీ రూపయగు శక్తి యొక్క ప్రాదుర్భావమే – ఉమయొక్క ప్రాదుర్భావములలో మొదటిదిగా కీర్తింపంబడుచున్నది.

**ప్రభ** :- పురాణములు – దక్షపుత్రికయగు దాక్షాయణిని 'సతి' అని చెప్పుచున్నవి.

'సతీ' పదమునకు – ఉన్నది – సతియనుపేరుగలది – అనునర్థములు రెండున్నవి.

'అజ' అనంగా, జన్మరహితయగు (పుట్టుకలేని), పరాశక్తి – దక్షునికంటె ముందును సతియే (ఉన్నదియే) అమెయే యిప్పుడు సతియైనది – (సతియే – సతి యైనది.)

సతీనామధేయమగు దాక్షాయణియొక్క రూపమునందు పరమేశ్వరశక్తి కొదవిన యభిమానము చేత – ఆదాక్షాయణియే – శక్తి యొక్క ప్రథమ ప్రావిర్భావముగాం జెప్పబడుచున్నదని భావము.

**అవ** :- ఇట్లు తల్లియగు పరశక్తియే, కౌమార్తెగానుండుటను – వేదము 'లాక్షణికభాషచేత చెప్పుచున్నదని చెప్పుచున్నాండు.'

మూ॥ ఆకాశస్య సుతైవం లక్షణ యావస్తుతః ప్రసూ ః శక్తిః।
అది తేర్దక్షో దక్షాదదితిశ్రుతిర బాధైవమ్॥ 12

కం. దక్షాంబ – శక్తి, యీ విధి
లక్షణచేం గన్యయై వెలసె నాతనికే,
'దక్షుం డదితికొదవె, నదితి
దక్షునకొదవె,' ననుశ్రుతి యథార్థముగాగన్॥

'ప్రజ్వలితాకాశమే దక్షుఁడు' అని చెప్పఁబడుటవలన వస్తుతః దక్షస్వరూపమగు నాకాశమునకు పరాశక్తియే జనయిత్రి (తల్లి) యగుచున్నది. ఆ శక్తియే జ్వలితాకాశరూపమగు దక్షునకుఁ గొమార్తెయై దాక్షాయణియగుట లక్షణావృతి చేత సిద్ధించుచున్నది. కనుక లక్ష్యార్థమే యిచట స్వీకరింపఁదగినది.

**ప్రభ** :- ముఖ్యార్థమునకు బాధకలుగునపుడు లక్షణా వృత్తి స్వీకరింపఁబడును.

'అది తేర్దక్షోఅజాయత – దక్షాద్వదితిః పరి' అను వేదమంత్రము ''అదితికి దక్షుఁడుపుట్టెను. దక్షున కదితిపుట్టెను.'' అనునసంభవమగు నర్థమును దెలుపుచున్నది. ఇందు మాతయగు నామెనే – సుతనుగాఁ జెప్పునపుడు. ముఖ్యార్థమునకు బాధ కలుగుట వలన లక్షణావృత్తి స్వీకరింపబడినది. వాచ్యార్థము, కుదరనప్పుడు 'లక్షణ' అనుశబ్ద వ్యాపారము స్వీకరింపఁబడును. దానిచేతఁ దెలుపఁబడునర్థము లక్ష్యార్థమని చెప్పఁబడును.

పూర్వోక్త సమన్వయమున, మీఁది వేదమంత్రము నిర్బాధమై, యథార్థమగుచున్నదని తెలియునది. దక్షునికి – తల్లియగు శక్తి – ఆదక్షునికే కొమార్తె యగుటవలన దాక్షాయణియను పేరఁ బ్రసిద్ధయయ్యెనని భావము.

**అవ** :- శక్తి – పురుషులను, పండితులు – భాషాభేదమున వ్యవహరించు చున్నారని చెప్పుచున్నాఁడు.

మూ॥ జగతాం మాతాపితరౌ సతీ- భవౌకేఽపి పణ్డితాః ప్రాహుః।
అదితి - ప్రజాపతీ తా, వపరేషాం భాషయా విదుషామ్॥ 13

గీ. లోకములకు మాతా పితరులు - 'సతీ - భ
వు' లనుచుం గొందఱు బుధోత్తములు - వచింత్రు
వారలయ్యదితి - ప్రజాపతులటంచు
పండితులు మఱికొందఱు పలుకుచుంద్రు.



'మనకుఁగనఁబడు నీలోకములకన్నింటిని - మాతాపితరులెవ్వరు'' అను ప్రశ్నమునకుఁ గొందఱు పండితులు 'సతీ- భవులు' (దాక్షాయణీ – శివులు) అని ప్రత్యుత్తరము నిచ్చుచున్నారు. మఱికొందఱు పండితులు ఈ లోకముల కన్నింటికిని తల్లిదండ్రులు దేవమాతయగు నదితియు, కశ్యపుఁడను ప్రజాపతియు, నగుచున్నారని చెప్పుచుందురు. ఇందు ద్వితీయమతము – పౌరాణికము.

అవ :- శక్తియుక్తుండగు నీశ్వరుడును. తచ్ఛక్తియును, 'లీలకొఱకు' స్త్రీ పురుషాకారములను స్వీకరించియున్నారని తెలుపుచున్నాఁడు.

మూ॥ దివ్యపుమాకృతి మీశోభిభ్రతి లీలార్థమస్యరమణాయ।
దివ్యవనితాకృతిం సా, బభారమాతాచ భువనానామ్॥ 14

కం. లోకులు రమింప, దివ్యపు
మాకృతి నీశ్వరుఁడు లీలకై భరియంపన్
లోకాంబిక - దివ్యప్రమ
దాకృతిఁ దానును ధరించె నతఁడు రమింపన్.

పురుషుఁడగు నీశ్వరుడు – లోకులు రమించునట్లు లీలకొఱకు దివ్యమగు పురుషాకారమును (మనుష్యాది దృష్టికిఁ గనఁబడనిదియు, భావనాగమ్యమును, అగురూపమును) భరింపగానే, భువనమాతయగు (పరా) శక్తి కూడ నా పరమేశ్వరుని రమింపజేయుటకై దివ్యప్రమదాకారమును (మనుష్యాదుల దృష్టికి గోచరింపక, భావనాగమ్యమును, ద్యులోచితమును నగు దివ్య స్త్రీరూపమును) ధరించెను.

**అవ** :- ఆమెనే 'ఉమ' యందురని, ఉపనిషత్ ప్రతిపాదితమగు భాషనుపయోగించి తత్ స్వరూపమును విశేషించుచున్నాఁడు.

మూ॥ భాసురహేమాభరణాం బహుశోభామీశ్వర ప్రమోదకలామ్।
మూర్తిం, పావనకీర్తిం, తాం హైమవతీ ముమామాహుః 15

ఉ. భాసుర హేమభూషణ విభాసిత దివ్యశరీర, నీశ్వరో
ల్లాసకళా స్వరూప, సకలంకయశో విభవన్, ప్రభూత శో
భా సముదీర్ణరూపయగు హైమవతిన్ - నిగమాంతవాక్యవి
న్యాసవిహారయై తగు నుమాభిధగావచియింత్రు పండితుల్.

ప్రకాశవంతములగు సౌవర్ణాభరణములచే విరాజితమగు దివ్య మంగళ విగ్రహము గలదియు - ఈశ్వరానందావిర్భూత రసికతావిష్కారక రతిరహస్య విద్యారూపయు, పవిత్రమగు కీర్తిగలదియు, బహుశోభమానయు, నగు హైమవతినే పండితులు ''ఉమ'' యని చెప్పుదురు.

**ప్రభ :-** ఉమాపద నిర్వచనభేదము ముందు తెలుపఁబడును. 'హిమవంతుని కొమరిత - హైమవతి' అను నిర్వచనము యుక్తమయినదయినను, ఇచ్చట ప్రకృతముననుసరించి హైమమనఁగా, 'సౌవర్ణజ్యోతి' అనియు, అది కలది 'హైమవతి' అనియుఁ జెప్పుట యుక్తమగుచున్నది. గ్రంథకర్త - ఋగ్వేదము ననుసరించి, దక్షుని కదితి కల్గెనని యుల్లేఖించి, తరువాత తలవకారశాఖులచేత (కేనోపనిషత్తుచేత) తెలుపఁబడిన యుమాకథను స్మరించుచున్నాడు. దేవాసురులకు యుద్ధము జరిగెను. అందు పరమేశ్వరానుగ్రహమున దేవతలకు విజయము కలిగెను. అసురవిజయము మావలననే లభించినదని దేవత లహంకరింపఁదొడఁగిరి. అప్పుడచ్చట నాద్యంతరహితమగు నొకానొక యక్షస్వరూపము కనుబడియెను.

ఆయక్షస్వరూపమును దెనిసికొనుటకు, అగ్నియు, వాయువును, ప్రయత్నించి విఫలులయిన పిమ్మట - దేవేంద్రుఁడు దానిని దెలిసికొనుటకు ప్రయత్నించి సమీపింపఁగా ఆయక్షస్వరూప మంతర్ధానము నొందెను. అప్పుడా యాకాశమునందతఁడు - మీఁదవర్ణింపఁబడిన ఉమాస్వరూపమును (స్త్రీరూపిణి యగునుమను) చూచెను. దేవేంద్రుఁడు ''తిరోహితమైన యక్షస్వరూపమే'' దని ప్రశ్నింపనాయుమ - అది బ్రహ్మస్వరూపమని చెప్పెను.



ఈ యంశము కేనోపనిషత్తునందిట్టున్నది.
'స ( ఇన్ద్రః) తస్మిన్నే వాకాశే స్త్రియ మాజగామ, బహు
శోభమానాముమాం హైమవతీం, తాంహోవాచ
కిం తద్యక్షమితి, సాబ్రహ్మేతిహోవాచ' ॥

కేనోపనిషత్తునందు వర్ణింపఁబడిన ఈ యుమాస్వరూపమే మీది పద్యమున సవిస్తరించి వర్ణింపఁబడినది. ఈ యంశమే యుత్తరశ్లోకమున స్పష్టముగా విశదీకరింపఁబడుచున్నది.

మూ॥ తస్యప్రథమః సాక్షీభువన జుషాంనయన శాలినాంమధ్యే।
వపుషః కిలాదిసుదృశో నిరుపమపుణ్యో నిలిమ్పపతిః॥ 16

గీ. జగములందున్కిగల నేత్రశాలులందు
అసమ సుకృతాత్ముఁడా సురాధ్యక్షుఁ డొకఁడే!
అది సుదృగప్రమేయ కల్యాణదేహ
మధుర సౌందర్యదీప్తికి మొదటిసాక్షి

పూర్వోక్తమగు నాదిశక్తి యొక్క దేదీప్యమానమగు కల్యాణ విగ్రహమును చక్షుష్మంతులలో (కన్నులున్న వారలందటి లోపలను) మొదటఁజూచిన మహాపుణ్యాత్ముఁడు - దేవేంద్రుఁ డొక్కఁడే యగుచున్నాఁడు.

**ప్రభ :-** ఆయాకాశమున, బహుశోభమానయు హైమవతియు నగు ఉమాదేవతను జూచి, ఇంద్రుఁడు 'అమ్మా! ఆయక్షస్వరూపమేమి' అని యడిగెను. ఆయమ్మ - అది - బ్రహ్మమని చెప్పెను. అని కేనోపనిషత్తు తెలుపును.

**అప :-** తనకభిమతమగు రీతి నాయుమా దేవతను స్మరించుచున్నాఁడు.

మూ॥ పల్లవమృదు, వేదిగతజ్వలన పవిత్రం, మహార్ఘమణికాన్తమ్,
నవచన్ద్ర ఖణ్డసౌమ్యం శివసుదృశః తత్ స్మరామివపుః॥ 17

చం. నవశశిఖణ్డసౌమ్యము, ననర్ఘ మహామణి కాంతియుక్తమున్
బ్రవిమల వేది మధ్యగత పావక పావనరూపశాలి, ప
ల్లవ మృదులంబు, సుందర కళా పరిపూర్ణ విచిత్రమూర్తి శ్రీ
శివతరుణీశరీరమును జింతనమునన్ బొనరింతు నిత్యమున్.

నూతనమగు చంద్రఖండమువలె ప్రసన్నమయినదియు, అమూల్యమగు మహామణియొక్క కాంతివంటి కాంతితోఁ గూడియున్నదగుట చేత కమనీయమయినదియు, స్వచ్ఛమగు యజ్ఞవేదిక నడుమనుండు నగ్నిహోత్రమువలె పవిత్రమగు రూపమున నొప్పుచున్నదియు, చిగురువలె మృదువయినదియు, సౌందర్యపూర్ణములగు కళలతోఁ గూడి యెల్ల చోటులందును నద్భుతమగు నాకృతిగలదియునగు శివతరుణి యొక్క (లేబ్రాయమునగలదివలెనున్న శివకాంతయొక్క) శరీరమును నిత్యము స్మరించి ధ్యానింతును.

**ప్రభ** :- ఇందు – ప్రసన్నత్వ, కమనీయత్వ, పావనత్వ, మృదుత్వములకు – క్రమముగా – శశిఖణ్డాదిగతములకు గుణ విశేషములతోడి సాదృశ్యమును వర్ణించి ఉమా దేవతాశరీరమును స్మరించుచున్నానని కవి చెప్పుచున్నాఁడు. యోగబలము వలననో, స్వభావసిద్ధమగు సామర్థ్యమువలననో, జన్మాంతరమునందో, లేక, లోకాంతరమునందో తనకు దృష్టపరిచితమయిన యుమా శరీరమును కవి స్మరించెనని గ్రహించునది.

**అవ** :- ఈ యువమా దేవతనే పురాణ ప్రసిద్ధయగు 'గౌరి' అని కొందఱందురని చెప్పుచున్నాఁడు.

మూ॥ కేచన 'గౌరీం' దేవీం, శ్రీతాద్రేదే వతాత్మనోజాతామ్।
కథయని స్త్రియ, ముత్తమలావణ్యాస్వాదితో గణ్యామ్॥ 18



గీ. దేవతాత్ముండయిన హిమాద్రికి జనించి
'గౌరి' యను పేర విఖ్యాతిఁ గనిన దేవి;
'నసమలావణ్య వతులయం దగ్రగణ్య
యయిన స్త్రీరత్న' మని కొందఱందురహహ.

ఉత్తర దిక్కునందున్న హిమవంతుడు దేవతాస్వరూపుడు. కనుకనే మహాకవి యగు కాళిదాసు

'అస్త్యుత్తరస్యాందిశి దేవతాత్మా। హిమాలయో నామన గాధిరాజః'
''ఉత్తరదిక్కునందు – దేవతాత్ముఁడగు హిమాలయుఁడను పర్వత రాజున్నాఁడు.'' అని హిమాలయపర్వతమున కధిదేవతయగు హిమాలయుఁడను పురుషుఁడున్నట్లు చెప్పెను.

జగత్ప్రసిద్ధుఁడును, పురుషాకారయుక్తుఁడును, అధిదేవతా స్వరూపుఁడునునగు నాహిమాలయునకుఁ బుట్టిన గౌరీదేవిని – మహా లావణ్యవతులగు స్త్రీలయందు మొట్టమొదట లెక్కింపఁదగిన దానినిగాఁ గొందఱు చెప్పుదురు.

**అవ** :- హిమవంతుని కొమరిత – 'గౌరి' అను భక్తగీతయగు కథకూడ సత్యముకావచ్చును, గాని, దాని యాదార్థ్యమును పర్యాలోచించునెడల – ఆ గౌరీ మూర్తి – పరాశక్తియగు నుమయొక్క తేజోంశ విశేషమే యగుననుచున్నాఁడు.

మూ॥ సత్యైవ భవతు సేయంకథా తథాఽపి ప్రభాషితాం భక్తైః।
తాంమూర్తి మాదిసుదృశో జానీయాత్ కమపితేజోంశమ్॥ 19

గీ. ఆకథాంశమ్ము – సత్యమేయయిన నగును
గాక, అయినను భక్తసంఘము (నుతించు) వచించు
నామె నాది సుదృఙ్మూర్తి' సప్రతర్క్య శ్రీ
మయిన తేజోఽంశమని యాత్మనరయవలయు.

భక్తులచేత గౌరి దేవిగా కీర్తింపఁబడుచున్న దివ్యమంగళ విగ్రహమును పరాశక్తి యొక్క మహాతేజస్సునం దొకానొక యంశ (భాగ) మని తలంచుట యుక్తమగుచుండునని తెలియునది.

**అవ** :- ''వేదమునందీపార్వతీ – తేజోంశమని యెట్లు చెప్పఁబడినది ?'' అనినఁ జెప్పుచున్నాఁడు

మూ॥ మన్యన్తే కేఽపి ఘనంపర్వతముక్తం నిగూఢయావాచా।
ప్రాదుర్భవతి గభీరధ్వని రవిషహ్యా యతః శక్తిః॥ 20

కం. అతిగూఢ వేదభాషా
హిత పర్వతపదము - ఘనమునే తెల్పు, గభీ।
రతమావిషహ్యారవ, తదు
దిత, విద్యుచ్ఛక్తి, పార్వతియనన్ వెలయున్.

నిగూఢమగు (మిక్కిలి రహస్యమగు) వేదభాషచేఁ జెప్పఁబడిన ఘనము (మేఘము) అనుపదమునకు 'పర్వత' పదము, పర్యాయముగా జెప్పఁబడినది.

నిరుక్తమున మేఘమునకు ముప్పది పేళ్లున్నవి. అందీపర్వత పదము తొమ్మిదవదిగా పఠింపఁబడియున్నది. కావున పర్వతమనగా మేఘమను నర్థము సిద్ధించుచున్నది. ఆ పర్వతమునుండి – అనఁగా మేఘమునుండి, గంభీరమగు ధ్వనిగలిగి, సహించుటకు శక్యముగాని, విద్యుద్రూపమగు నేశక్తిపుట్టుచున్నదో, ''అదియే, 'పార్వతి' అని కొందఱు తలంచుచున్నారు.

**ప్రభ** :- ''పర్వతమనఁగా, మేఘము, ఆ పర్వతమునుండి పుట్టిన విద్యుచ్ఛక్తియే – 'పార్వతి' అని భావము.

**అవ** :- 'పురాణములయందు దక్షయాగ కథగలదు. అది యెట్లు సమన్వయింపఁబడును' అని యాశంకించి, గూఢార్థవివరణ రూపములగు రెండు శ్లోకములచేఁ గుదుర్చుచున్నాఁడు.



మూ॥ ఆకాశో గోలేభ్యోయద్వితరతి నిజరజశ్చయాదన్నమ్।
నేశాయకీర్త్యతేసా సంసారే దక్షయాగకథా॥ 21

గీ. 'నిజరజస్సంచయమునుండి నిఖిలగోళ
ములకు, నభమన్న వితరణంబు నొనరించు,
నీశ్వరునకీయ,' దను నంశమేదికలదొ
అదియె-సంసారమున 'దక్షయాగ గాథ'

దక్షయాగవృత్తాంతము – పురాణములయం దిట్లుచెప్పఁబడియున్నది.

''దక్షుఁడను ప్రజాపతి- యాగము నొనర్చునపుడు దేవతలందఱను బిలిచి, వారికి హవిర్దానముల నొసఁగెను. కాని శివుని బిలిచి యాతనికి హవిర్దానము నొసఁగెడయ్యెను. అప్పుడు రుద్రుఁడు – క్రుద్ధుఁడయ్యెను. తండ్రిచేయుచున్న యాగమును జూచుటకై వచ్చిన దాక్షాయణి (సతీదేవి) వెంటనే యోగాగ్ని దగ్ధదేహయై యంతర్ధానము నొందెను.'' అని – ఈ గాథయందలి గూఢార్థము మీది శ్లోకమునఁ జెప్పఁబడినది.

'' ఆకాశము – సమస్తగోళములకును తన రేణు సమూహము వలన జనన-జీవన-పోషణములకు సాధనమగు నన్నమునిచ్చుచుండును. కాని యీశ్వరునకు మాత్ర మిచ్చుటలేదు.'' అనునదియే. దక్షయాగకథ యందలి గూఢార్థము.

**ప్రభ** :- ఇంతకుముందు – పరమాత్మనుండి వేఱయిన స్వరూపము గలిగి ప్రకాశించుచున్న యాకాశమే దక్షుఁడని చెప్పఁబడియెనుగదా! ఆదక్షుని నుండియే సమస్తలోకములకును గూడ నాధారమగు సామగ్రి విస్పష్టమగుచుండును (దానము చేయఁబడుచుండును.) కాని ఆసామగ్రి యీశ్వరుఁడగు పరమపురుషున కీయఁబడుట లేదు.'' అనునది యిందలి గూఢార్థము.

**అవ** :- దహ్రాఖ్యమగు నాకాశముయొక్క యుదరమందున్నశక్తి – సర్వవ్యాపినియై యున్నను, అంతర్నిగూఢ యగుచున్నది. కనుకనే బాహ్యదృష్టి నపేక్షించి నష్టయయినట్లుండుటవలన నష్టయయ్యెనని తరువాతి కథయొక్క గూఢార్థమును ప్రదర్శించుచున్నాఁడు.

మూ. వ్యాప్తాఽపి యన్నిగూఢా బహిరీక్షక బుద్ధ్యపేక్షయా నష్టా।
శక్తిర్యాగే తస్మిన్నవసానంతదుదితం సత్యాః॥ 22

గీ. ' ఆమె - సర్వజగద్ వ్యాప్త - యయ్యుఁదాను
గుప్తరూపయై బహిరీక్షకులగువారి
బుద్ధులకు నష్టయగు' ననుబోధ- దక్ష
యాగమున సతికొందవు నిర్యాణమయ్యె.

పరాశక్తి – యెల్లెడలను వ్యాపించియున్నను అంతర్దృష్టులకేగాని బాహ్య దృష్టి గలవారికిఁ గాన్పింపని దగుచుండును. కావున దానినే దక్షయాగమునందగు దాక్షాయణీ నిర్యాణమునుగాఁ జెప్పుదురు.

**ప్రభ** :- నష్టయనఁగా; 'కనుపింపకుండుటను బొందినది' అని యర్థము, గాని లేకుండుటను పొందినదని యర్థము కాదని యెఱుంగునది.

**అవ** :- వేదభాష ననుసరించునపుఁడు తెలుపఁదగిన పార్వతీ శబ్దార్థమును స్పష్టీకరించుచున్నాఁడు.

మూ. పర్వతనామ్నో వైదిక భాషాయాం యదియమతి బలాశక్తిః॥
ఘనతో భవతివ్యక్తా తదభిహితం 'పార్వతీజననమ్'॥ 23



కం. నిగమోక్తిఁ బర్వతాఖ్య
మ్మగు మేఘమునుండి వ్యక్తమగు హేతువునన్
బొగడుదు రతిబల, నీశ
క్తిఁ, గనుంగొను బుధులు 'పార్వతీజననము' గన్.

అత్యధికమగు సామర్థ్యముగల యీ శక్తి వైదిక భాషయందు పర్వతమను పేరుగల మేఘమునుండి విద్యుచ్ఛక్తిరూపమున స్పష్టపడుచున్నది. కావున పర్వతమునుండి పుట్టిన యీ శక్తిని – పార్వతియనియు, ఆమె జననమును పార్వతీజనన మనియుఁ జెప్పుచున్నారు.

**ప్రభ** :– ''వైద్యుతమగు జ్యోతి యొక్క జననమే – పార్వతీ జననము.'' అని వేదము చెప్పుచున్నదని భావము.

**అవ** :– గూఢార్థవివరణ మిట్లున్నను భూలోకవాసులమగు నస్మదాదుల ననుగ్రహించుటకై హిమాచలమునందున్న శివ – శక్తుల సాన్నిధ్యము కూడ బాధింపఁబడనేరదనుచున్నాఁడు.

మూ॥ తేజోఽంశతః శివావిహహిమాచలేఽనుగ్రహాయ భూమిభుషామ్।
ధత్తేయత్సాన్నిధ్యం, లీలాచారిత్ర మన్యదిదమ్॥ 24

మ. ఒకతేజోఽంశమునుండి పుట్టిజనరక్షోద్యోగముంబూని, తా
మొక కాలంబున పార్వతీశ్వరులు శీతోర్విధ్రమందుండి, భ
క్తకదంబమ్ములకున్ స్వసన్నిధియు, సాక్షాత్కారమున్ గూర్చిన
ట్టి కథాంశమ్మది వేఱు, లీలకయిపుట్టైదచ్చరిత్రమ్మిలన్.

భూలోకమునందున్న లోకుల ననుగ్రహించుటకై, ఒకానొక సమయమున అఖండమగు మహాతేజమునందలి యొక భాగమునుండి యేర్పడి, దేవతాత్మయగు హిమాలయు నిక్షేత్రమున నివసించుచు, నిజ భక్తులకు తమసాన్నిధ్యమును

గటాక్షించినట్లు చెప్పఁబడిన పార్వతీపరమేశ్వరుల చరిత్రము - వేదోక్తమగు నభిప్రాయముకంటె వేఱయి యున్నది. అది - భక్తానుగ్రహము కొఱకుఁ గావింపబడిన యొకానొక లీల. కావున నదియు సత్యమేయని నిశ్చయింపనగును.

ప్రభ :- హిమాచల క్షేత్ర నివాసులగు పార్వతీపరమేశ్వరులు - తేజోమయదేహులనియు, సూక్ష్మదృగ్గోచరులనియు గ్రహించునది.

అవ :- ప్రథమస్తబకము నుపసంహరించుచున్నాఁడు.

మూ॥ ఏతాసామార్యాణాం జానన్తః శాస్త్రసమ్మతం భావమ్।
జానీయుర్భవమహిషీం భువనానామమ్బికాం దేవీమ్ ॥ 25

గీ. శాస్త్రసమ్మతముగ సమకూర్పఁబడిన, ఆ
ర్యాశయము నెఱుఁగునట్టి బుధులు
భవుని మహిషియగుచు భువనంబులకు నెల్ల
నంబయయిన దేవి నరయఁగలరు.

వేదాదిశాస్త్ర సమ్మతమగుతీరున, ఆర్యాశయమును ( ఆర్యావృత్తము లందలివియు, ఆర్యులవియునగు అభిప్రాయమును) తెలిసికొనిన విద్వాంసులు - భవానియు జగన్మాతయు నగు నుమాదేవత యొక్క స్వరూపమును గ్రహింపగల్గుదురు.

ప్రభ :- ఆర్యాశయమనఁగా, ( ఆర్య + ఆశయము) పెద్దల యభిప్రాయము, అనియు, ( ఆర్యా + ఆశయము) ఆర్యావృత్తముల యభిప్రాయము, అనియు నర్థము. ఈ యర్థము - తెలుఁగుపద్యమునఁ గూడ నుపపన్న మగుచున్నదని యెఱుంగునది.

ఇది సవ్యాఖ్యమగు ప్రథమస్తబకము

****



ఓమ్ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః
శ్రీ సరస్వతీ దేవ్యై నమః
ఓమ్ నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి ద్వితీయ స్తబకము)

అవ :- మొదట శతకమునందున్న - ఈ ద్వితీయస్తబకమున - ఈశ్వర-శక్తులకుఁ గల భేదాభేదస్వరూపమును, అన్యోన్యసంబంధమును, సమయభేద కథన ద్వారమున ప్రతిపాదించుచున్నాఁడు. మఱియు నిందే సంక్షేపరీతిని సృష్టి ప్రకారమును నిరూపించి, అధ్యత్మ - అధి దైవత - విచారము చేతను, త్రిమూర్తి - పంచమూర్తి - సిద్ధాంతోప పాదనము చేతను, కవికిష్ట దేవతయు మహాశక్తియునగు ఉమ- ప్రస్తుతింపఁబడుచున్నది.

మూ॥ సహోదరేణ యో వలక్ష పారిజాతమాలయా
గలస్థలీ విభూషయా ధ్వనిం వినైవ భాషతే।
మహేశపుణ్యయోషితో మనోజ్ఞ హాస ఏష, మే
విభూతయే ప్రకల్పతాం విఘాతయేచ పాప్మనామ్॥ 1

మ. గళము నలంకరించి సితకాంతియుతంబగు పారిజాతపు
ష్ప లలితమాలతోఁ జెలిమి శబ్దము లేకయె మాటలాడుచున్
వెలయు మహేశపుణ్యసతి నిర్మలహాసము, మా విభూతికిన్
గలుషవిఘాతికిన్ ప్రబల - కారణమై మముఁ బ్రోచుఁగావుత్

ఆంధ్రానువాదము :- కంఠాభరణమై ప్రకాశించుచు, శుభ్రమగు ( తెల్లని) వర్ణముఁ గలిగియున్న పారిజాత పుష్పమాలతోఁ గూడి ఆదరము గలిగి